

150 వ భాగం

పరీక్షిత్తు - 2

పుట్టిన కుర్రాడి జాతకం ఎలా ఉంటుంది అనేది ధర్మరాజు అడిగితే ఇప్పుడు వచ్చిన పురోహితులు చెప్తున్నారు. ఈ పురోహితుల్లో పాండవుల పురోహితుడు ధౌమ్యుడు కూడా ఉండడం గమనించాం. ఈ కుర్రాడు ఎలా పుట్టాడో కూడా వాళ్ళకి తెలుసు.

చ. ప్రకటిత దైవయోగమునఁ బౌరవ సంతతి యంతరింపఁగా
వికలత నొందనీక ప్రభవిష్ణుఁడు విష్ణుఁ డనుగ్రహించి శా
బకుఁ బ్రతికించెఁ గావున నృపాలక! శాబకుఁ డింక శాత్రవాం
తకుఁ డగు; విష్ణురాతుఁ డన ధాత్రిఁ బ్రసిద్ధికి నెక్కుఁ బూజ్యుఁడై [1-290]

దైవ యోగం వల్ల పాండవ వంశం నాశనం అవుతున్నప్పుడు, పరువు అదీ పోకుండా ఉండడానికి విష్ణువు అనుగ్రహించి బతికించాడు. ఈ విష్ణువు ప్రభవిష్ణువు – అవతరించే శీలం కలవాడు (అందుకే కృష్ణుడు). విష్ణురాతుడు అని ప్రసిద్ధికెక్కి శత్రువులని అంతమొందించేవాడు (శాత్రవాంతకుడు) అవుతాడు.

వ. అనిన విని భూదేవోత్తములకు నరదేవోత్తముం డిట్లనియె. [1-291]

శా. ఓ పుణ్యాత్మకులార! నాపలుకు మీ రూహింపుఁడా మ్రొక్కెదన్
మా పెద్దల్ శ్రుతకీర్తులై సదయులై మన్నారు రాజర్షులై,
యీ పిన్నాతఁడు వారిఁ బోలెడిఁ గదా యెల్లప్పుడున్? మాధవ
శ్రీపాదాంబుజ భక్తియుక్తుఁ డగుచున్ జీవించునే? చూడరే. [1-292]

ఇక్కడ ధర్మరాజుకి (నరదేవోత్తముడు) సందేహం ఏమిటంటే, తమ కులంలో పెద్దవారు, తండ్రీ తాతలందరూ కూడా కారుణ్యమూర్తులై, రాజర్షులయ్యారు. వీడు కూడా అలా ఉంటాడా? అదీగాక మాధవుడిని గుర్తు పెట్టుకుని భక్తిగా జీవిస్తాడా లేదా? పుణ్యాత్ములైన మీరు (భూదేవత్తములు) చూసి చెప్పండి.

వ. అనిన విని "నరేంద్రా! భవదీయపౌత్రుండు మనుపుత్రుం డయిన యిక్ష్వాకుని చందంబునఁ బ్రజల రక్షించు; శ్రీరామచంద్రుని భంగి బ్రహ్మణ్యుండు సత్యప్రతిజ్ఞుండు నగు; డేగ వెంటనంటిన బిట్టు భీతంబై వెనుకకు వచ్చిన కపోతంబుఁ గాచిన శిబిచక్రవర్తి రీతి శరణ్యుండును వితరణఖనియు నగు; దుష్యంతసూనుం డైన భరతు పగిది సోమాన్వయ జ్ఞాతివర్గంబులకు యజ్వలకు ననర్గళ కీర్తి విస్తరించు; ధనంజయ కార్తవీర్యుల కరణి ధనుర్ధరాగ్రేసరుం డగుఁ; గీలి పోలిక దుర్ధర్షం డగు; సముద్రుని తెఱంగున దుస్తరుం డగు; మృగేంద్రంబు కైవడి విక్రమశాలి యగు; వసుమతిపోలె నక్షయక్షాంతియుక్తుం డగు; భానుని లాగునఁ బ్రతాపవంతుం డగు; వాసుదేవు వడువున సర్వభూతహితుం డగుఁ; దల్లిదండ్రులమాడ్కి సహిష్ణుం డగు; మఱియును. [1-293]

ఇక్కడ కొంచెం స్వభావోక్తితో పైకి ఎత్తేసి చెప్తున్నారు. శ్రీరాముడిలాగా సత్య ప్రతిజ్ఞుడూ, అర్జునుడిలా ధనుర్ధాగ్రేసరుడూ, విక్రమశాలీ అయినా వాసుదేవుడిలా అందరికీ మంచి కోరేవాడిలా ఉంటాడు,

భు. హరించుం గలిప్రేరితాఘంబు లెల్లన్,
భరించున్ ధరన్ రామభద్రుండుఁ బోలెన్,
జరించున్ సదా వేదశాస్త్రానువృత్తిన్,
వరించున్ విశేషించి వైకుంఠభక్తిన్. [1-295]

కలియుగంలో కలిగే కల్మషాలని హరిస్తాడు. రామచంద్రుడిలా భూభారాన్ని మోస్తాడు. వేద శాస్త్రాలు చెప్పినట్టూ నడుచుకుంటూ కృష్ణుడి మీద (విష్ణువు మీద) భక్తితో జీవిస్తాడు. అయితే చివరకి ఏమౌతాడు? అది కూడా ఇప్పుడే చెప్పేస్తున్నారు.

పై పద్యం ఏ వృత్తమో గమనించారా? దీన్ని భుజంగ ప్రయాతము అంటారు. ప్రతీ పాదంలో మొదటి పదాలు చూడండి – హరించు, భరించు, జరించు, వరించు. పోతన మొత్తం భాగవతంలో ఈ భుజంగ ప్రయాతం ఒకేసారి ఇక్కడ

మాత్రమే వాడాడుట. అలాగే పంచ చామరము, తోటకం అనే వృత్తాలు కూడా ఒకేసారి వాడాడుట. ఆశ్చర్యంగా ఉంది కదా? చదువరులకి తన కవితా పటిమ చూపెట్టడం కన్నా భక్తికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి అతి సులభంగా రాయడానికే మక్కువ చూపించాడు పోతన. అందుకే తెలుగువారు ఏనాటికీ ఈ పద్యాలు మర్చిపోలేరు.

వ. ఇట్లు పెక్కేండ్లు జీవించి భూసుర కుమార ప్రేరితం బయిన తక్షకసర్ప విషానలంబునం దనకు మరణం బని యెఱింగి, సంగవర్జితుం డయి, ముకుంద పదారవింద భజనంబు సేయుచు, శుకయోగీంద్రుని వలన నాత్మవిజ్ఞాన సంపన్నుం డై, గంగాతటంబున శరీరంబు విడిచి, నిర్గత భయశోకం బయిన లోకంబుఁ బ్రవేశించు"నని, జాతకఫలంబు సెప్పి లబ్ధకాము లయి భూసురులు సని రంత. [1-296]

ఇలా చాలా ఏళ్ళు జీవించాక బ్రాహ్మణ కుమారుడిచ్చే (భూసుర కుమార ప్రేరితంబైన) శాపం మూలంగా తక్షకుడు అనే సర్పం విషం వల్ల తనకి మరణం రాబోతోంది అని తెలుసుకుంటాడు. అప్పుడు అన్నీ వదులుకుని (సంగవర్జితుండయి), శుకయోగి వల్ల ఆత్మ జ్ఞానుడై (శుకయోగీంద్రుని వలన నాత్మవిజ్ఞాన సంపన్నుం డై) గంగా తీరంలో శరీరం విడుస్తాడు. ఇలా ఆత్మ జ్ఞానం కలుగుతుంది కనక భయం, శోకం లేని విష్ణులోకం పొందుతాడు.

క. తన తల్లి కడుపులోపల
ముసు సూచిన విభుఁడు విశ్వమున నెల్లఁ గలం
డనుచుఁ బరీక్షింపఁగ జను
లనఘుఁ బరీక్షన్నరేంద్రుఁ డంద్రు మునీంద్రా! [1-297]

పెట్టబోయే పేరు ఏమౌతుందో కూడా చెప్తున్నారు. తల్లి కడుపులో ఉన్నప్పుడు తనని రక్షించిన విష్ణువు విశ్వంలో అంతటా ఉన్నాడా అని పరీక్ష చేసాడు కనక పరీక్షిత్తు అని పిలవబడతాడు. మహాభారతంలో కథ కొంచెం తేడా ఉండడం చూడవచ్చు. వంశం నాశనం అవుతుంటే అది నిలబెట్టడానికి పరీక్షగా పుట్టాడు కనక పరీక్షిత్ అని పేరుపెట్టారని ఉండడం చూస్తాం.

ఈ పరీక్షిత్తు అసలు ఎలా చనిపోతాడనేది మరోకథ. పైన కథలో మనం చూసాం భూసురోత్తములు అందరూ ఏం చెప్పారో పుట్టిన కుర్రాడి గురించి – కలియుగంలో కలిగే కల్మషాలని హరిస్తాడు. రామచంద్రుడిలా భూభారాన్ని మోస్తాడు అంటూ. అయినా సరే, కర్మ మన చేత ఏ ఛండాలపు పని అయినా చేయిస్తుందనేదానికి ఈ కథ ఒక పెద్ద ఉదాహరణ. ఓ

సారి ఈ పరీక్షిత్ వేటకి వెళ్ళాడు. చాలాసేపటికి దాహం వేసి ఒక ముని ఆశ్రమం దగ్గిర ఆగాడు. అక్కడ శమీకుడు అనే ముని కళ్ళుమూసుకుని ధ్యానంలో ఉన్నాడు. ఆయన్ని తాగడానికి నీరు ఇవ్వమని అడిగాడు. ధ్యానం లో ఉన్న ఆయనకి ఇవేమీ వినిపించలేదు.

ఉ. కన్నులు మూసి బ్రాహ్మణుఁడు గర్వముతోడుత నున్నవాఁడు, చే
సన్నలనైన రమ్మనఁడు, సారజలంబులు దెచ్చి పోయఁ, డే
మన్నన లైనఁ జేయఁడు, సమగ్రఫలంబులు వెట్టఁ, డింత సం
పన్నత నొందెనే? తన తపశ్చరణాప్రతిమప్రభావముల్. [1-462]

పరీక్షిత్ ఆయన్ని చూసి అనుకుంటున్నాడు – ఈయన కళ్ళు మూసుకుని గర్వంతో ఉన్నాడు. అడిగినా సరే పిల్చి మంచి నీరు ఇవ్వడం లేదు. వచ్చిన అతిథికి మన్నన చేసి ఫలమో ఏదో పెట్టడం కూడాలేదు. తన తపశ్శక్తితో ఏమి సంపదలు సంపాదించాడా? ఇది దాహం, ఆకలి వల్ల కలిగే మాయ అనుకోవాల్సిందే.

ఆయన ధ్యానంలో ఉన్నాడని పరీక్షిత్ అంతటివాడికి తెలియదా? అసలే ధర్మరాజు మనవడు, ధర్మం తెల్సినవాడు, రాజుగా బాగా పేరు ఉన్నవాడు కూడా. అయినా సరే కోపం ఆపుకోలేక అక్కడే చచ్చి పడి ఉన్న పామును తీసి ఆయన మెడలో వేసి వెళ్ళిపోయాడు. రాజైనవాడు అలా చేయొచ్చా? పోనీ కూడా ఎవరూ లేరా అలా చేయవద్దు అని చెప్పడానికి? కర్మ వెనక నుంచి పేరేపిస్తూ ఉంటే ఇలాంటి పనులే గొప్ప గొప్ప వారు తెలిసి కూడా చేయడం మనం చూస్తూ ఉంటాం.

ఈయన వెళ్ళాక శమీకుడు కొడుకు శృంగి అనే ఆయన వచ్చి చూశాడు.

ఉ. ఆడడు తన్ను దూషణము, లాశ్రమవాసులఁ గాని వైరులం
గూడఁడు, కందమూలములు గూడుగఁ దించు సమాధినిష్ఠుఁడై
వీడఁడు లోనిచూడ్కులను, విష్ణునిఁ దక్కఁ బరప్రపంచముం
జూడఁడు, మద్గురుండు, ఫణిఁ జుట్టఁగ నేటికి రాచవానికిన్? [1-468]

తన తండ్రి ఎలాటివాడు? ఎవరినీ తిట్టడు. ఎవరితోనూ వైరం లేదు. కందమూల ఫలాలు తింటూ సమాధినిష్ఠుడై, ప్రపంచం అంతా భగవన్మయంగా (విష్ణునిఁ దక్కఁ బరప్రపంచముం జూడడు) చూసేవాడు. అటువంటి వాడి మెడలో ఇలా సర్పాన్ని వేయడానికి ఈ రాజుకి ఎలా చేతులొచ్చాయి? దీనికి కారణం ఏమిటి?

క. భగవంతుఁడు గోవిందుఁడు
జగతిం బెడఁబాసి చనిన శాసింపంగాఁ
దగువారు లేమి దుర్జను
లెగసి మహాసాధుజనుల నేఁచెద రకటా! [1-471]

భగవంతుడైన కృష్ణుడు అవతారం చాలించాక (గోవిందుఁడు జగతిం బెడబాసి), శాసించడానికి ఎవరూ లేకపోవబట్టి ఇలా దుర్జనులు పైకి లేస్తూ సాధువులని పీడిస్తున్నారు కాబోలు. ఇలా అని శాపం ఇవ్వడానికి ఆయుత్తమయ్యాడు.

వ. ఇట్లు రోషించి కౌశికీనదికిం జని జలోపస్పర్శంబు సేసి. [1-473]

ఉ. ఓడక వింటికోపున మృతోరగముం గొని వచ్చి మాఱు మా
టాడకయున్న మజ్జనకు నంసతలంబునఁ బెట్టి దుర్మద
క్రీడఁ జరించు రాజు హరకేశవు లడ్డినఁ నైనఁ జచ్చుఁ బో
యేడవ నాఁడు తక్షకఫణీంద్ర విషానల హేతి సంహతిన్. [1-474]

శృంగి కోపంతో కౌశికీ నదికి వెళ్ళి నీరు చేతిలోకి తీసుకుని శపించాడు – మాట్లాడకుండా ఉన్న నా తండ్రి మెడలో చచ్చిన పామును వేసి ఇటువంటి దరిద్రపు పనులు చేసే రాజు శివకేశవులు అడ్డమైనా సరే (హర కేశవులడ్డిననైన) తక్షకుడు అనే సర్పం విషం వల్ల ఈ రోజునుంచి ఏడవ రోజున చచ్చి తీరుతాడు.

ఇలా శాపం ఇచ్చాడని శమీకుడికి తెలిసాక ఆయన కొడుకుని తప్పు పడతాడు. రాజు ధర్మాత్ముడు. ఆయన కోపంలో ఏదో చేశాడు. కానీ తాపసులైన తమకి శాంతం ఉండాలి అలా శపించకూడదు. అయితే ఇచ్చిన శాపానికి

తిరుగులేదు కనక వెళ్ళి రాజు తో చెప్పు, ఆయన ప్రయత్నం ఆయన చేసుకుంటాడు అంటాడు. ఈ వార్త రాజుగారికి చేరింది. ఆయన అనుకుంటున్నాడు.

ఉ. ఏటికి వేఁట వోయితి మునీంద్రుఁడు గాఢసమాధి నుండఁగా
నేటికిఁ దద్భుజాగ్రమున నేసితి సర్పశవంబుఁ దెచ్చి? నేఁ
డేటికిఁ బాపసాహసము లీ క్రియఁ జేసితి? దైవయోగమున్
దాఁటఁగ రాదు, వేగిరమ తథ్యము గీడు జనించు ఘోరమై. [1-490]

నేను వేటకి ఎందుకెళ్ళాను? ముని సమాధిలో ఉండగా ఆ చచ్చిన పామును మెడలో ఎందుకు వేశాను (దద్భుజాగ్రమున నేసితి సర్పశవంబుఁ దెచ్చి)? దైవ యోగం కాకపోతే ఇదంతా తప్పకుండా కీడు చేసి తీరుతుంది. అలా అనుకుని గంగాతీరానికి వెళ్ళి ప్రాయోపవేశం చేయబోతాడు. ఈయన వారంలో పోతాడనగా శుక మహర్షి వస్తాడు. ఈ కథంతా విన్నాక ఆయన చెప్తాడు. నీకు ఇంకా వారం ఉందికదా. ఖట్వాంగుడనే ఆయన రెండు ఘడియల్లో విష్ణుసన్నిధికి చేరుకోగలిగాడు [రసగుళికలు-92, 142] కనక నువ్వు కూడా అలాగే చేయవచ్చు.

అలా ఒక వారంలో శుకమహర్షి భాగవతం (విష్ణు లీలలు) అంతా చెప్పాక పురోహితులు మొదట్లో చెప్పినట్టూ తక్షకుడు వచ్చి కాటు వేయడం, పరీక్షిత్ కృష్ణుణ్ణి తల్చుకుంటూ ప్రాణాలు పోగొట్టుకోవడం జరుగుతుంది.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS